# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com



సంపుటి : 3 సంచిక : 60 శనివారం 8 ఫిబ్రవరి 2025 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




### ట్రంప్‌తో మోదీ

## మీటింగ్ ఫిక్స్

- "ఫిబ్రవరి 12,13 తేదీల్లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన
- ట్రంప్ ప్రమాణస్వీకారం అనంతరం మొదటగా కలుసుకోనున్న కొద్ది మంది ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు"
- విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి
- భారత ప్రధానమంత్రికి తాను ఆతిథ్యం ఇవ్వనున్నట్టు ట్రంప్ గత నెలలో ప్రకటన

### కేబినెట్ విస్తరణ

# ఇప్పట్లో లేనట్లే



- కేబినెట్ విస్తరణ, రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్‌పై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- మంత్రివర్గంలో ఎవరు ఉండాలో అధిష్ఠానం నిర్ణయిస్తుందన్న ముఖ్యమంత్రి
- రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదు
- సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా తాము పని చేస్తున్నాం
- పీసీసీ కార్యవర్గాన్ని ఒకటి లేదా రెండో రోజుల్లో ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ

పీసీసీ కార్యవర్గం కూర్పుపై తెలంగాణ అగ్రనేతలతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సుదీర్ఘ చర్చలు జరుపుతోన్నారు. అందులోభాగంగా రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలతో కేసీ వేణుగోపాల్ విడివిడిగా చర్చలు జరుపుతోన్నారు. ఆ క్రమంలో ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కేసీ వేణుగోపాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు - మిగతా3లో



## ఓవరాక్షన్ చేయొద్దు

- హైకోర్టు న్యాయవాదికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక
- అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజగోపాల్ నగర్‌లో పర్యటించిన రంగనాథ్
- బాధితుల సమస్యలు వింటుండగా జోక్యం చేసుకున్న హైకోర్టు న్యాయవాది ముఖీం
- మీరు ఓవరాక్షన్ చేయవద్దని హైడ్రా కమిషనర్ హెచ్చరిక

హైదరాబాద్

ప్లాట్ల విషయంలో కొనుగోలుదారులను కొందరు భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాలు చెప్పింది వింటామని, అదే సమయంలో కోర్టు పరిధిలో ఉన్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రెండు నెలల్లో - మిగతా3లో



### రాతపూర్వకంగా

## స్పందిస్తాం

- రాహుల్ ఆరోపణలపై ఈసీ
- రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలు, సూచనలను తాము గౌరవిస్తాం
- దేశవ్యాప్తంగా ఒకేలా తాము అనుసరించిన విధానపరమైన అంశాలతో త్వరలోనే లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తాం
- ఓటర్ల జాబితాలో ఎన్నో అవకతవకలు జరిగాయని రాహుల్ గాంధీ శుక్రవారంనాడు మీడియా సమావేశంలో ఆరోపణ

## ఇదేనా ప్రజాపాలన?

- సీఎం రేవంత్ రెడ్డికి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదు
- పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సరిగా అందడం లేదు
- నాణ్యమైన భోజనం అందించడం లేదు.. పిల్లలను పస్తులు ఉంచుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సరిగా అందడం లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని, పిల్లలను పస్తులు ఉంచుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారంటే, ఇక మంత్రుల నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ చిన్నపిల్లలకు భోజనం అందించడంలో సీఎంకు లేదంటూ విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం - మిగతా3లో

## పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఇండియన్ ఆర్మీ

- జమ్మూకశ్మీర్‌లో ఏడుగురు పాక్ చొరబాటుదారుల హతం
- కశ్మీర్‌లో భారత భద్రతా బలగాలకు విజయం
- చొరబాట్లకు యత్నించిన పాకిస్థాన్ ఉగ్రవాదులు
- పాక్ ప్రయత్నాన్ని దీటుగా తిప్పికొట్టిన భారత సైన్యం



## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు

- సీఎం రేవంత్‌పై హరీష్‌రావు ధ్వజం
- గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో నమోదయ్యాయి
- వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన



హైదరాబాద్

గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు బాధాకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని చెప్పారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రేవంత్ ప్రభుత్వంపై హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాంగ్రెస్ - మిగతా3లో

# తెలంగాణలో ఎన్నికల ఫీవర్

- ఫిబ్రవరి 11న కలెక్టర్లతో ఈసీ సమావేశం
- గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలపై జోరుగా చర్చలు
- ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు ఎదురు చూస్తున్నారు
- మరో 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ కానుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హింట్
- స్థానిక సంస్థల ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు
- పోలింగ్ కేంద్రాలు,బ్యాలెట్‌బాక్స్‌లు, బూత్‌లు సిద్ధం
- ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



హైదరాబాద్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ఫీవర్ మెదలైంది. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. మరో 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ కానుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హింట్ ఇచ్చారు. తాజాగా.. రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక అప్డేట్ ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ కేంద్రాలు,బ్యాలెట్‌బాక్స్‌లు, బూత్‌లు సిద్ధం కాగా.. ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కూడా ప్రారంభించింది.ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, పోలింగ్ సిబ్బంది నియామకానికి తెలంగాణ ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు సైతం జారీ చేసింది. బీసీ ప్రత్యేక కమిషన్ త్వరలోనే రిజర్వేషన్ల ఖరారుపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఆ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి ఎన్నికల సంఘానికి ఇవ్వనుంది. ఆ రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదలకు సిద్ధమైంది. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణను ప్రారంభించారు. ముందుగా.. ప్రతి జిల్లాకు 10 మంది చొప్పున మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా జిల్లాల్లోని మిగితా సిబ్బందికి శిక్షణ ఇప్పించనున్నారు. - మిగతా3లో



## తమిళనాట బీజేపీ ప్లాన్ బీ

- ఎన్నికలకు ఏడాది ముందు నుంచే నయా స్కెచ్..!
- గత ఎన్నికల్లో తమిళనాడులో పాగా వేసేందుకు వేసిన స్కెచ్ పనిచేయక పోవడంతో ఈ సారి నయా స్కెచ్‌తో బీజేపీ ముందుకు వెళుతోందన్న చర్చ
- డిఎంకేని గద్దె దించడమే లక్ష్యంగా.. అయితే నేరుగా లేదంటే ఇండైరెక్ట్‌గా కొట్టేందుకు కమలనాథుల ప్లాన్

# తమిళనాట బీజేపీ ప్లాన్ బీ



తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉంది.. కానీ అక్కడ అప్పుడే రాజకీయం రసవత్తరంగా మారింది. గత ఎన్నికల్లో తమిళనాడులో పాగా వేసేందుకు వేసిన స్కెచ్ పనిచేయక పోవడంతో ఈ సారి నయా స్కెచ్‌తో బీజేపీ ముందుకు వెళుతోందన్న చర్చ మొదలైంది. డిఎంకేని గద్దె దించడమే లక్ష్యంగా.. అయితే నేరుగా లేదంటే ఇండైరెక్ట్‌గా కొట్టేందుకు కమలనాథులు ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. డీఎంకేని గద్దె దించేందుకు అవసరమైతే ప్లాన్ బీని కూడా బీజేపీ సిద్ధం చేసుకుందన్న టాక్ వినిపిస్తోంది.

తమిళనాడులో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుంటాయి. 2021లో అసెంబ్లీ ఎన్నికలు జరగగా రెండున్నర ఏళ్ల తర్వాత గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. అధికారంలో ఉన్న పార్టీకి ఎంపీ సీట్లు అనుకూలంగా కొన్ని సార్లు, ప్రతిపక్షం కూటమికి అనుకూలంగా పలు సందర్భాల్లో తీర్పునిచ్చిన పరిస్థితి ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఉన్నట్లు కనిపించినా.. అంచనాలను మించి అధికార డీఎంకే స్వీప్ చేసేసింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు.. లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాట సత్తా చాటాలని బిజెపి చేసిన రెండు ప్రయత్నాలు ఫలించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ రెండూ కలిసి పోటీ చేయగా.. రెండు పార్టీలకూ ఈ పొత్తు నష్టమే కలిగించింది. బీజేపీతో పొత్తు కారణంగానే తాము తీవ్రంగా నష్టపోయినట్లు అన్నాడీఎంకే చీఫ్, మాజీ సీఎం పళనిస్వామి బహిరంగ వ్యాఖ్యలు చేశారు.

దీంతో 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రత్యేక కూటమి ఏర్పాటు చేసి బరిలోకి వెళ్లినా ఫలితం దక్కలేదు. దేశంలో ఎక్కడా లేని విధంగా శతాధిక పార్టీలు ఉన్నాయి తమిళనాట.. ఒక్కో కూటమిలో పదికి పైగా పార్టీలు ఉండడం సర్వసాధారణం. మినిమిమ్ ఐదు పార్టీలు కూడా కలిసి కూటమిగా ఎన్నికల బరిలో తలపడుతుంటాయి. ఎన్నికలన్నాక కూటములు.. కూటమి అన్నాక పార్టీలు ఉండడం సహజం.. అనేక ఈక్వేషన్స్ తో మరిన్ని పార్టీలతో కలిసి వెళ్ళక తప్పదు ఒక్కోసారి.. తమిళనాట ఒక్కసారి కాదు దశాబ్దాలుగా ఇదే జరుగుతోంది. తమిళనాట పార్టీల పేర్లలో ద్రవిడ అన్న పదం సెంటిమెంట్ గా ఉంటుంది. ఒకప్పుడు ద్రవిడ వాదం బలంగా ఉన్న తమిళనాట రాజకీయ పార్టీలు ఇప్పుడు కూడా తమ అవసరాల కోసం ఆ సెంటిమెంట్‌నే కొనసాగిస్తున్నాయి. దశాబ్దాల పాటు కరుణానిధి నేతృత్వంలో నడిచిన డీఎంకే, జయలలిత లీడ్ చేసిన అన్నాడిఎంకే, ఆ తర్వాత ఆ ఇద్దరు లేని ఆ పార్టీలు కూడా పొత్తులతో కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలోకి దిగిన పరిస్థితి. రాజకీయంగా కాస్త విభిన్నమైన పరిస్థితి ఉన్న తమిళనాడులో గట్టిగా కొట్టాలనేది బిజెపిని చాలా కాలం నుంచి ఊరిస్తోంది. 2014 లో కన్యాకుమారి ఒక్క స్థానంలో గెలిచింది. అయితే 2019లో బోణి కూడా కొట్టలేకపోయింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో బిజెపి విజయం సాధించింది. ఆతర్వాత బిజెపి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టింది. ఐపీఎస్ అధికారి అన్నామలై వి.ఆర్.ఎస్ తీసుకుని పార్టీని లీడ్ చేస్తున్నారు. ద్రవిడ వాదం బూచిగా చూపించి రాజకీయం చేస్తున్నాయి అంటూ ద్రవిడ వాద పార్టీలపై పోరాటం, హిందూత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అన్నామలై సక్సెస్ అయ్యారన్న డిస్కషన్ జరిగినా సీట్లు మాత్రం రాబట్టలేకపోయింది. దీంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో గట్టిగా కొట్టాలి అనేది బిజెపి ప్లాన్.. ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి 10 శాతం, ఎడిఎంకె కు 20 శాతం ఓట్లు వచ్చాయి.. తాజాగా నటుడు విజయ్ స్థాపించిన టీవీకేని కలుపుకుని కూటమిగా ముందుకు వెళ్లాలని బిజెపి భావిస్తోంది. అలాగే వన్నియార్ సామాజిక వర్గం ఓట్లు అధికంగా కలిగిన పీఎంకెతో పాటు మరికొన్ని పార్టీలతో జాతకట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఒకవేళ 2021లో బిజెపి %-% అన్నాడీఎంకే అలయన్స్ ఫెయిల్ అవడం ఉదాహరణగా చూస్తే మాత్రం ఈసారి ఆ కలయిక మంచిది కాదన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. అలాంటప్పుడు బిజెపి ప్లాన్ బి వ్యూహాన్ని అనుసరిస్తున్నట్టు తెలుస్తోంది. డీఎంకేకి వ్యతిరేకంగా ఒక బలమైన కూటమిని ఏర్పాటు చేసి తద్వారా అధికారంలోకి ఆ కూటమిని తీసుకురావాలనేది ఆలోచన.. అయితే ఆ కూటమిలో బిజెపి ఉండదు. డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు దూరంగా ఉండే పార్టీలతో జతకట్టి బీజేపీ బరిలో నిలిచి.. నటుడు విజయ్ టీవీకే పార్టీతో పాటు అన్నాడిఎంకేలో మూడుగా విడిపోయిన పళనిస్వామి, పన్నీరు సెల్వం, శశికళ అందరిని ఏకతాటిపైకి తెచ్చి బలమైన సామాజిక వర్గం ఓట్లు అధికంగా కలిగిన పార్టీలకు కూటముగా ఏర్పాటు చేసి డీఎంకే అధికారంలోకి రాకుండా చూడొచ్చన్న ఆలోచనలో కూడా బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది.

తద్వారా బిజెపి నేరుగా అధికారంలోకి రాకపోయినా ఆ తర్వాత వచ్చే 2029 పార్లమెంట్ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి అధికారంలో ఉంటే తమకు కలిసి వస్తుందన్న లోతైన వ్యూహంలో బీజేపీ ఉన్నట్టు ఆ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ కూటమితో కలిసి దశాబ్దాలుగా రాజకీయం చేస్తున్న డిఎంకే.. బిజెపికి ఎప్పుడూ వ్యతిరేకంగానే ఉంటుంది. గతంలో కూడా జయలలిత బిజెపికి బీ టీం అన్నట్లుగా వ్యవహరించారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకే కాకుండా అన్నాడీఎంకే తమిళనాడులో అధికారంలోకి వస్తే పరోక్షంగా అది తమకు కలిసి వచ్చే అంశంగానే బిజెపి భావిస్తూ వ్యూహంతో ముందుకు వెళుతున్నట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి.

# రాతపూర్వకంగా స్పందిస్తాం



**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించింది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలు, సూచనలను తాము గౌరవిస్తామని, దేశవ్యాప్తంగా ఒకేలా తామూ అనుసరించిన విధానపరమైన అంశాలతో త్వరలోనే లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తామని తెలిపింది.

**రాహుల్ ఏమన్నారు?**

మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఎన్నో అవకతవకలు జరిగాయని రాహుల్ గాంధీ శుక్రవారంనాడు మీడియా సమావేశంలో ఆరోపించారు. శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, ఎన్‌సీపీ-ఎస్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాహుల్ మాట్లాడుతూ, విపక్ష పార్టీలన్నీ కలిసి మహారాష్ట్ర ఎన్నికల్లో పోరాడాయని, ఈ ఎన్నికలకు సంబంధించి కొంత సమాచారం మీడియా దృష్టికి తెస్తున్నామని అన్నారు. ఓటర్లు, ఓటర్ల జాబితాను తాము సమగ్రమంగా అధ్యయనం చేశాయమని, పలు అవకతకవలు జరిగినట్టు కనుగొన్నామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఐదు నెలలకు శాసనసభ ఎన్నికలు జరిగాయని, ఈ 5 నెలల్లో మహారాష్ట్రలో 39 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారన్నారు. 2019 విధానసభ ఎన్నికల తర్వాత నుంచి 2024 లోక్‌సభ ఎన్నికల వరకు 32 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదుకాగా, కేవలం ఐదు నెలల్లో 39 లక్షల మంది ఓటర్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని మొత్తం ఓటర్ల జనాభా కంటే మహారాష్ట్రలో ఎక్కువ ఓటర్లు ఎలా వచ్చారని ప్రశ్నించారు. మహారాష్ట్రలో అకస్మాత్తుగా కొత్త ఓటర్లను సృష్టించారని ఆరోపించారు. తాము పదేపదే ఈసీకి విజ్ఞప్తులు చేసినా పట్టింకోలేదన్నారు.

మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు తమకు ఇవ్వాలని ఈసీని కోరినట్టు రాహుల్ చెప్పారు. తద్వారా కొత్తగా చేసిన ఓటర్లు ఎవరనేది కచ్చితంగా అర్థమవుతుందన్నారు. ఎంత మందిన ఒక బూత్ నుంచి మరో బూత్‌కు ఎందుకు బదిలీ చేశారో, ఎంతమది ఓటర్లను తొలగించారనే తెలుస్తుందని చెప్పారు. ముఖ్యంగా దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన చాలా మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడం, వేరే బూత్‌లకు బదిలీ చేయడం చేశారని రాహుల్ ఆరోపించారు. తాము పదేపదే దీనిపై ఈసీకి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఏదో తప్పిదం జరగడమే ఈసీ స్పందించకపోవడానికి ఏకైక కారణమని ఆరోపించారు. తాను ఎలాంటి ఆరోపణలు చేయడం లేదని, స్పష్టంగా గణాంకాలు మీడియా ముందుంచుతున్నానని అన్నారు.

# ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు ముందు హైడ్రామా

ఫలితాలు కూడా రాబోతున్నాయ్! ఈ చిన్న గ్యాప్‌లోనూ ఢిల్లీ దద్దరిల్లుతోంది. ఒకరిపై మరొకరు విమర్శలతో విరుచుకుపడుతున్నారు. తీవ్ర ఆరోపణలకూ దిగుతున్నారు. ఇక తాజాగా ఢిల్లీలో నడుస్తున్న హైడ్రామా ఫలితాలపై ఇంకాస్త ఆసక్తిని పెంచాయి. ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు ముందు శుక్రవారం హైడ్రామా కొనసాగుతోంది. తమ ఎమ్మెల్యే అభ్యర్థులను బీజేపీ కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిందనే ఆప్ ఆరోపణలు కాకరేపాయి. 16 మంది ఆప్ అభ్యర్థులను కొనుగోలు చేసేందుకు.. బీజేపీ ఆఫర్ చేసిందని.. ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తోపాటు పలువురు నేతలు ఆరోపించారు. దాంతో.. నిగ్గుదేల్చాలని బీజేపీ డిమాండ్ చేయడం మరింత హీట్ పెంచింది. భారతీయ జనతా పార్టీ పై మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించారు..

**అసలేం జరిగిందంటే..**

అరవింద్ కేజ్రీవాల్ తోపాటు పలువురు నేతలు.. గురువారం మాట్లాడుతూ.. తమ అభ్యర్థులను బీజేపీ కొనేందుకు యత్నించినట్టు ఆరోపణలు గుప్పించారు. ఆపరేషన్ లోటస్ ప్రారంభించారంటూ విమర్శించారు. ఇప్పటిదాకా 16 మందికిపైగా ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులకు బీజేపీ నుంచి ఫోన్ కాల్స్ వెళ్లినట్లు లెక్కతో సహా చెబుతున్నారు ఎంపీ సంజయ్ సింగ్. ఒక్కొక్కరికి 15 కోట్లు ఆఫర్ చేస్తున్నట్లు బీజేపీపై మండిపడ్డారు. బీజేపీ ఫిర్యాదుతో ఆప్ బేరసారాల ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించారు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా.. ఆ వెంటనే.. ఏసీబీ అధికారుల బృందం కేజ్రీవాల్ ఇంటికి వెళ్లింది. అంతకు ముందే ఆప్ అభ్యర్థులు అంతా అక్కడకు చేరుకోగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.





దర్యాప్తునకు హాజరుకావాలని ఏసీబీ బృందం నోటీసులు సైతం ఇచ్చింది. ఇక.. కేజ్రీవాల్ ఇంట్లో ఏసీబీ దర్యాప్తుపై ఆప్ న్యాయవాదులు ఆందోళనకు దిగారు. ఏసీబీ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు కేజ్రీవాల్ తరపు న్యాయవాది రిషికేష్‌కుమార్. ఏ రూల్ ప్రకారం కేజ్రీవాల్ ఇంటికి ఏసీబీ అధికారులు వచ్చారని ప్రశ్నించారు. కేజ్రీవాల్ ఇంట్లోకి ఏసీబీ రావడం చట్టవిరుద్ధం అన్నారు. దర్యాప్తు సంస్థలను కొందరు కామెడీగా మార్చేస్తున్నారని ఆరోపించారు కేజ్రీవాల్ తరపు న్యాయవాది రిషికేష్‌కుమార్. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ డ్రామా చేస్తున్నారని ఆరోపించారు ఆమ్‌ఆద్మీ ఎంపీ సంజయ్‌సింగ్. ఇప్పటివరకు 16 మందికి పైగా ఆప్ అభ్యర్థులకు బీజేపీ నుంచి ఫోన్లు వచ్చాయన్నారు. బీజేపీ కొనుగోలు వ్యవహారంపై ఏసీబీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సంజయ్‌సింగ్.కాగా.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి.. ఫలితాలకు కొన్ని గంటల ముందు.. రాజకీయం మరింత హీటెక్కింది..

## ట్రంప్‌తో మోదీ మీటింగ్ ఫిక్స్



**న్యూఢిల్లీ:** ప్రధాన నరేంద్ర మోదీ అమెరికా పర్యటన తేదీలు ఖరారు అయ్యారు. ఫిబ్రవరి 12-13 తేదీల్లో మోదీ అమెరికాలో పర్యటిస్తారని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శుక్రవారంనాడు తెలిపారు. తన పర్యటనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను మోదీ కలుసుకుంటారు. "ఫిబ్రవరి 12,13 తేదీల్లో ప్రధాని మోదీ అమెరికాలో అధికారిక పర్యటిస్తారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకరాం చేపట్టిన తర్వాత మోదీ జరుపుతున్న తొలి పర్యటన ఇది. ట్రంప్ ప్రమాణస్వీకారం అనంతరం మొదటగా కలుసుకోనున్న కొద్ది మంది ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు" అని మిడియా సమావేశంలో మిస్రీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడిని వచ్చేవారంలో కలుసుకునేందుకు మోదీని ఆహ్వానించినట్టు వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు ఇటీల ప్రకటించిన క్రమంలో మోదీ పర్యటన తేదీలు ఖరారయ్యారు. భారత ప్రధానమంత్రికి తాను ఆతిథ్యం ఇవ్వనున్నట్టు ట్రంప్ గత నెలలో ప్రకటించారు. "చాలాకాలం తర్వాత ఈరోజు ఉదయం ఫోనులో మాట్లాడాను. బహుశా ఫిబ్రవరిలో ఆయనకు శ్వేతసౌధానికి వచ్చే అవకాశం ఉంది" అని ట్రంప్ తెలిపారు. గత జనవరి 27న ట్రంప్‌తో మోదీ ఫోనులో సంభాషించారు. అంతర్జాతీయ శాంతి, భద్ర, టెక్నాలకీ-ట్రేడ్-డిఫెన్స్ రంగాల్లో అడ్వాన్స్‌డ్ కోఆపరేషన్‌కు తీసుకోవాల్సిన చర్యలపై ఉభయులూ చర్చించారు. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పెంచుకోవడంతో పాటు దేశంలోని స్కిల్డ్ వర్కర్లకు వీసాల మంజూరును సులభతరం చేయాలని ప్రధానంగా ఈ పర్యటనలో ట్రంప్ దృష్టికి మోదీ తీసుకువచ్చే అవకాశాలున్నాయి.

## పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఇండియన్ ఆర్మీ



**ఢిల్లీ:** జమ్మూకాశ్మీర్‌లో శుక్రవారం సుమారు 12 మంది పాక్ ఉగ్రవాదులు హతమయ్యారు. కృష్ణా ఘాటీ సెక్టార్ వద్ద ఏడుగురు పాక్ ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. భారత సైనిక శిబిరంపై ఉగ్రవాదులు ఆకస్మిక దాడికి పాల్పడ్డారు. దాడి చేసి కృష్ణా ఘాటీ సెక్టార్‌లోకి ప్రవేశించేందుకు యత్నించారు. అయితే వారి చొరబాటు ప్రయత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఆకస్మిక దాడి చేసిన పాక్ ఉగ్రవాదులపైకి ఎదురుకాల్పులు జరిపారు. ఈ దాడుల్లో ఏడుగురు ఉగ్రవాదులు మృతిచెందారు. మరోవైపు జమ్మూకాశ్మీర్ పూంచ్ జిల్లాలోని బత్తల్ సెక్టార్‌లో ల్యాండ్‌మైన్ పేలి ఐదుగురు పాక్ ఉగ్రవాదులు మరణించారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి భారత వైపునకు ఉగ్రవాదులు కంచె దాడుతున్న సమయంలో మందుపాతర పేలింది. ఓ ఉగ్రవాది ల్యాండ్‌మైన్ మీద కాలివేయడంతో ఈ సంఘటన జరిగిందని అధికారిక వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదుల వద్ద ఐఈడీ కూడా ఉందని ల్యాండ్‌మైన్‌తోపాటు ఐఈడీ కూడా పేలిపోయినట్లు వెల్లడించారు. భారత్?లోకి ఉగ్రవాదులు ప్రవేశించకుండా ఇండియన్ ఆర్మీ.. లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద వివిధ ప్రాంతాల్లో ల్యాండ్ మైన్లు ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే అక్రమంగా ప్రవేశిస్తున్న ఉగ్రవాదులు మృతిచెందినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీని పాక్ కశ్మీర్ సంఘీభావ దినంగా పాటిస్తోంది. ఈ సందర్భంగా భారత్ లో చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు ప్రయత్నించారు. జమ్మూకశ్మీర్ లోని పూంచ్ సెక్టార్ లో కృష్ణా ఘాటి వద్ద టెర్రరిస్టుల చొరబాటు యత్నాన్ని భారత జవాన్లు భగ్నం చేశారు. ఉగ్రవాదులు చొరబడేందుకు వీలుగా భారత సైన్యం దృష్టి మరల్చేందుకు పాక్ బోర్డర్ యాక్షన్ టీమ్ (బీఏటీ) కాల్పులకు తెగబడింది. ఓ భారత సైనిక పోస్టుపై కాల్పులు జరిపింది. ఈ కాల్పులను భారత సైన్యం దీటుగా తిప్పికొట్టింది. ఈ ఘటనలోనే ఏడుగురు పాకిస్థానీలు హతమయ్యారు. మృతుల్లో పలువురు అల్ బదర్ ఉగ్రవాద గ్రూపుకు చెందిన వారు ఉన్నట్టు భావిస్తున్నారు.

## అమెరికా బహిష్కరణ జాబితాలో 487 మంది భారతీయులు: విదేశాంగ శాఖ

**అక్రమ వలసదారులపై అమెరికా కఠిన వైఖరి**

**104 మంది భారతీయులను వెనక్కి పంపిన అగ్రరాజ్యం**

**సంకెళ్లతో వెనక్కి పంపించడంపై భారత్ ఆందోళన తెలియజేశామన్న విదేశాంగ శాఖ**

అమెరికా బహిష్కరణకు గురైన వారి తుది జాబితాలో 487 మంది భారతీయులు ఉన్నారని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అక్రమ వలసదారుల తరలింపులో భాగంగా ఇదివరకే 104 మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపింది. ఈ నేపథ్యంలో అమెరికా బహిష్కరణ తుది జాబితాలో ఎంతమంది ఉన్నారనే విషయాన్ని విదేశాంగ శాఖ వెల్లడించింది. అదే సమయంలో, భారతీయులను సంకెళ్లతో తరలించిన అంశంపై కూడా విదేశాంగ శాఖ స్పందించింది. ఈ విషయమై అమెరికా వద్ద తమ ఆందోళనను తెలియజేశామని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు.

## ఎంసీసీ ఉల్లంఘనపై 1,100 కేసులు, 35,000 మంది అరెస్టు

**న్యూఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై భారీగా కేసులు నమోదయ్యాయి. పెద్ద సంఖ్యలో అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఎంసీసీ ఉల్లంఘనల కింద 1,100 కేసులు నమోదు కాగా, 35,000 మందిని అరెస్టు చేసినట్టు శుక్రవారంనాడు ఒక అధికార ప్రకటన వెల్లడించింది. జనవరి 7వ తేదీన ఎంసీసీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ ఈ కేసుల నమోదు, అరెస్టుల పర్వం చోటుచేసుకుంది. ఢిల్లీ పోలీసులు విడుదల చేసిన సమాచారం ప్రకారం, వివిధ నిబంధనల కింద ముందస్తు చర్యలు, ఇతర కార్యకలాపాల్లో భాగంగా 35,516 మందిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమ ఆయుధాల నిరోధక చట్టం కింద 499 మందిని అరెస్టు చేసి, 477 అక్రమ మారణాయుధాలు, 538 కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. 1,15,103 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 1,426 మందిని అరెస్టు చేశారు. రూ.77.9 కోట్లు విలువచేసే 206.712 కిలోల మాదక ద్రవ్యాలు, 1.200 నిషేధిత ఇంజక్షన్లు స్వాధీనం చేసుకుని 179 మందిని అరెస్టు చేశారు. రూ.11.70 కోట్ల నగదు, 37.39 కిలోల వెండిని ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి.

# కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే


-మొదటిపేజీ తరువాయి

తెలుస్తోంది. తెలంగాణ కేబినెట్ విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లేనని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, మంత్రివర్గంలో ఎవరు ఉండాలనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు. తాను మాత్రం ఎవరి పేరునూ ప్రతిపాదించడం లేదన్నారు. ప్రతిపక్ష నేతలపై కేసుల విషయమై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. కేసుల విషయంలో చట్ట ప్రకారం వెళతామన్నారు. ప్రతిపక్ష నేతలను త్వరగా అరెస్ట్ చేసి జైల్లో వేయాలనే ఆలోచన తమకు లేదన్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా తాము పని చేస్తున్నామని ఆయన అన్నారు.

అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తాము కుల గణన సర్వే చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. కుల గణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లవుతుందన్నారు. కుల గణనలో బీసీలు ఐదున్నర శాతం పెరిగినట్లు తెలిపారు. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చిందని, రెండ్రోజుల్లో ప్రకటన ఉంటుందని ఆయన తెలిపారు.

**రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదు**

తాను రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్‌ను కోరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాహుల్ గాంధీతో తన అనుబంధంపై తెలియని వాళ్లు మాట్లాడితే తనకేం సంబంధమన్నారు. ప్రభుత్వం, పార్టీలో కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయని ఆయన తెలిపారు. పార్టీ, పార్టీ నేతల మనోభావాలకు అనుగుణంగానే తాను ముందుకు



సాగుతానన్నారు. వ్యక్తిగత నిర్ణయాలు ఉండవన్నారు. పార్టీ ఇచ్చిన పనిని పూర్తి చేయడమే తన లక్ష్యమన్నారు. తనకు పని చేసుకుంటూ వెళ్లడమే తెలుసునని, ప్రతి విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు.

ఈ నేపథ్యంలో పీసీసీ కార్యవర్గాన్ని ఒకటి లేదా రెండో రోజుల్లో ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం. మరోవైపు పీసీసీలో నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండ వచ్చున్న కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి. వీరి నియామకాల్లో సామాజిక సమతుల్యం పాటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నలుగురిలో ఒకరు మాదిగ, ఒకరు ముస్లిం, ఒకరు లంబాడి, ఒకరు రెడ్డి వర్గాలకు కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం. అలాగే 15 నుంచి 20 మందిని పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించే అవకాశముంది. అదే విధంగా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులపై కూడా నేతలు ఈ సందర్భంగా కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ సమావేశంలో కేబినెట్‌లో మార్పులపై ఎలాంటి సమాలోచనలు జరపలేదని తెలుస్తోంది. ప్రస్తుతానికి మంత్రి వర్గ విస్తరణ లేదని ఆ పార్టీ ముఖ్య నేతలు సైతం పేర్కొంటున్నారు. మరోవైపు మంత్రివర్గం కూర్పుపై తెలంగాణ నేతల అభిప్రాయాలను సైతం పార్టీ అధిష్ఠానం నేతలు సేకరిస్తున్నట్లు ఓ చర్చ అయితే జరుగుతోంది. సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డిలతోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు దీపాదాస్ మున్షిలతో ఆ పార్టీ అధిష్టానం ఒక్కొక్కరితో చర్చించి.. అభిప్రాయాలను సైతం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం అభిప్రాయాన్ని మాత్రమే తీసుకుందని.. కానీ ఇప్పుడే విస్తరణకు అవకాశం మాత్రం లేదంటూ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.

ఫిబ్రవరి 06వ తేదీ సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు దీపాదాస్ మున్షీ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధిష్టానంతో వారు సమావేశమయ్యారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే నివేదికను సైతం ఆ పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు సమాచారం. ఈ నివేదికను శాస్త్రీయంగా, సమగ్రం రూపొందించామని వివరించారు. అలాగే ఎస్సీ వర్గీకరణ అంశంపై సబ్ కమిటీ, జ్యూడిషియల్ కమిటీ ఆమోదించిన తర్వాతే.. కేబినెట్ లో ఆమోద ముద్ర వేసినట్లు పార్టీ అధిష్టానానికి వీరు సోదాహరణగా వివరించారు. ఇంకోవైపు ఎస్సీ వర్గీకరణ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. అందుకోసం లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధ్యక్షతన ఈ సభలు జరిగేలా ఆ పార్టీ నేతలు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారు.

# ఓవరాక్షన్ చేయొద్దు

-మొదటిపేజీ తరువాయి

సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రంగనాథ్ ఈరోజు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో గల రాజగోపాల్ నగర్‌లో పర్యటించారు. తమ ప్లాట్లను కొంతమంది కబ్జా చేస్తున్నారంటూ రాజగోపాల్ నగర్ ప్లాట్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో ఐలాపూర్‌లో పర్యటించిన రంగనాథ్ బాధితుల సమస్యలను విన్నారు.

**ఇరువురి మధ్య వాదన**

రాజగోపాల్ నగర్ అసోసియేషన్ సభ్యులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశమయ్యారు. రంగనాథ్ బాధితుల సమస్యలు వింటున్న సమయంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకున్నారు. న్యాయవాది ముఖీం, 'మీకు తెలుగు వచ్చా' అని హైడ్రా కమిషనర్‌ను అడిగారు. కోర్టు



పరిధిలో ఉన్న దానిని చూసేందుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఓవర్ యాక్షన్ చేయవద్దని న్యాయవాదిని రంగనాథ్ హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది.

**వారిని ముందు పెట్టి కబ్జా చేశారనే ఆరోపణ: రంగనాథ్**

రాజగోపాల్ నగర్‌లో 40 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేశామని, కానీ కొంతమంది వచ్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారని రంగనాథ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను ముందు పెట్టి ముఖీం అనే న్యాయవాది దీనిని కబ్జా చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయన్నారు. కానీ 1980లలో ప్లాట్లు కొన్న వారిలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, పేదవారు ఉన్నారని రంగనాథ్ వెల్లడించారు. కరోనా సమయంలో తాము కట్టుకున్న ఇళ్లను కూలగొట్టారని బాధితులు ఆరోపించారని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి వాస్తవాలు తెలుసుకోవడానికి తాము ఇక్కడకు వచ్చామన్నారు.


# తెలంగాణలో ఎన్నికల ఫీవర్

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి కాగా.. రేపటి నుంచి జిల్లాల్లో ట్రైనింగ్ ఇవ్వనున్నారు.సర్పంచ్, వార్డమెంబర్లు,ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బందిని ఎంపిక చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. సిబ్బంది సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఒకటి లేదా రెండు దఫాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానుంది. సమావేశం తర్వాత.. ఎన్నికల షెడ్యూలుపై స్పష్టత వచ్చే ఛాన్స్ ఉందని అధికారులు అంటున్నారు. మె?త్తంగా ఫిబ్రవరి మూడో వారంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.


# పల్లెటూరు.. ఊరంగా గుప్పుగా మంచు తెరలు

**నల్గొండ :** అసలే చలికాలం.. అందులోనూ పల్లెటూరు.. ఊరంగా గుప్పుగా మంచు తెరలు పరుచుకున్నాయి. చలికి.. కొక్కొరొకో కూతతో ఊరిని నిద్రలేపే కోడి కూడా ముడుచుకుని పడుకుంది. తెల్లవారుజామున ఐదు గంటలు..అప్పుడప్పుడే కొంత మంది ముసలివాళ్లు నిద్రలేచి చలిమంటలేసుకుం టున్నారు. పాలు పితికేవాళ్లు చలికి వణుకుతూనే తమ పనులకు ఉపక్రమిస్తున్నారు. అదే సమయంలో పెద్ద కారొకటి వచ్చి ఆగింది. అయితే గియితే.. పొద్దున్నే పాల వ్యాను రావాలి కానీ.. దాని కంటే ముందే వచ్చిన ఈ కారు ఎవరిదబ్బా అని అక్కడున్న వాళ్లు తదేకంగా చూస్తున్నారు. అందులో నుంచి టిప్ టాప్‌గా ఉన్న ఓ ఆఫీసర్ కిందికి దిగాడు. ఆయన వెంట మరో ఇద్దరు ముగ్గురు కూడా దిగారు. చకచకా ఓ ఇంటికి వెళ్లి.. టక్ టక్ మంటూ తలుపు కొట్టారు. ఇంత పొద్దున ఎవరబ్బా అనుకుంటూనే ఆ ఇంటి మహిళ తలుపు తీసింది.ఎదురుగా ఉన్న ఆఫీసర్‌ను చూసి..ఆమెకున్న నిద్రమబ్బు మొత్తం వదిలిపోయింది. "ఎవరూ ఈ సారూ.. ఇంత పొద్దుగల్ల మా ఇంటికి ఎందుకొచ్చిండు..?" అని ఆమె మనసులో ప్రశ్నల ఊట మొదలైంది. నోరు పెగల్చి ఎవలు కావాలే అని అడిగాలనుకుంటుండగానే.. ఆ సారే ఆమెను పలకరించాడు. భరత్ చంద్ర మీ అబ్బాయేనా.. పదో తరగతి చదువుతున్నాడు కదా.. అని అడిగితే.. అవును అన్నట్టుగా తలూపింది. అప్పటికీ ఆమె ముఖంలో ఉన్నఆశ్చర్యంతో పాటు ప్రశ్నార్థకాన్ని గమనించి.. తనను తాను పరిచయం



చేసుకున్నాడు ఆ వ్యక్తి.ఆ వ్యక్తి ఎవరో కాదు.. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు. ఆయన వెళ్లింది సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని శేరిగూడెంలోని విజయలక్ష్మి ఇంటికి. విజయలక్ష్మి కుమారుడు భరత్ చంద్ర ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. భరత్ చంద్రకు తండ్రి లేకపోవటంతో.. విజయలక్ష్మి కష్టపడి తన చదివిస్తోంది. భరత్ చంద్ర స్థితిగతులు తెలుసుకున్న కలెక్టర్ హనుమంతరావు.. తాను శ్రీకారం చుట్టిన కొత్త కార్యక్రమం "వేకప్ కాల్"లో భాగంగా.. ఉదయం ఐదున్నరకు వాళ్లింటికి వెళ్లి తలుపు తట్టి నిద్రలేపారు.పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న వేళ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఈ వేకప్ కాల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు కలెక్టర్. ఇందులో భాగంగా.. పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఉదయాన్ని నిద్రలేపి..చదివించి పరీక్షలకు సిద్ధం చేపించాలన్నది కలెక్టర్ హనుమంతరావు ఉద్దేశం. ఈ క్రమంలోనే.. హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా రాత్రి సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో నిద్రించిన కలెక్టర్..ఉదయం ఐదున్నరకే ఎలాంటి సమాచారం లేకుండా భరత్ చంద్ర ఇంటికి వెళ్లారు.ఈ సందర్భంగా.. భరత్ చంద్ర గురించి క్షేమ సమాచారం తెలుసుకున్న కలెక్టర్ హనుమంతరావు.. పరీక్షల కోసం ఎలా చదువుతున్నావని అడిగారు. పదో తరగతి అనేది ప్రతి విద్యార్థికి మైలు రాయి అని.. కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకు తానే సొంతంగా ప్రతి నెలా 5 వేల రూపాయలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి నెలకు గానూ 5 వేల రూపాయలను అప్పటికప్పుడు భరత్ చంద్ర చేతికి అందించారు. అంతేకాదు.. స్టడీ ఛైర్‌తో పాటు, ఎగ్జామ్ ప్యాడ్, కొన్ని పుస్తకాలు, పెన్నులు కూడా అందించారు. "నిన్ను చదివించేందుకు మీ అమ్మ ఎంతగానో కష్టపడుతోందని.. నువ్వు కూడా కష్టపడి చదివి పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుని ఆమెకు సంతోషాన్ని ఇవ్వాలి" అని భరత్ చంద్రకు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.తన ఇంటికి జిల్లా కలెక్టర్ స్వయంగా రావటం నమ్మలేకపోతున్నానని.. భరత్ చంద్ర తెలిపాడు. ఆయన తన ఇంటికి రావటం తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని.. కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకుంటానని.. భవిష్యత్తులో పోలీస్ ఆఫీసర్ అవుతానని చెప్పుకొచ్చాడు భరత్ చంద్ర. తన ఇంటి తలుపు తట్టి.. తన కుమారున్ని ప్రోత్సహించి, అండగా నిలబడిన కలెక్టర్‌కు విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపింది.

## 100 మంది అమ్మాయిలు.. రూ.333 కోట్లు.. బత్తుల టార్గెట్ తెలిస్తే దిమ్మ తిరగాల్సిందే




జీవితంలో ఎవరైనా ఏం లక్ష్యంగా పెట్టుకొంటారు. మంచి ఉద్యోగం లేదా విదేశాలకు వెళ్లి బాగా డబ్బు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకొంటారు. కానీ ఇటీవల ప్రిజం పబ్ లో పోలీసులపై కాల్పులకు తెగబడి అడ్డంగా దొరికిపోయిన బత్తుల ప్రభాకర్ లక్ష్యాన్ని చూస్తే మైండ్ బ్లాంక్ కాదు.. అన్ని రంగులు ఈస్ట్ మన్ కలర్?లో కనిపిస్తాయి. పోలీసుల అదుపులో ఉన్న ఈ జగత్ కిలాడీ లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. బత్తుల ప్రభాకర్.. 100 మంది అమ్మాయిలను అనుభవించడం.. జీవిత కాలంలో రూ.333 కోట్లు సంపాదించడం.. ఇంజనీరింగ్ కాలేజీల్లో చోరీలు చేయడంతోపాటు విశాఖపట్నం జైలులోని ఖైదీలను కాల్చి చంపడం.. ఇలా అతగాడి లక్ష్యాలను చూసి పోలీసులు సైతం ఖంగు తిన్నారు. అయితే అతడిపై ఉన్న పాత నేరాల చిట్టాను పోలీసులు బయటకు దీశారు. దీంతో బత్తుల ప్రభాకర్?పై దాదాపు 80 కేసులు నమోదైనట్లు గుర్తించారు. అంతేకాదు అతగాడు.. రాహుల్ రెడ్డి అలియాస్ సర్వేష్ రెడ్డి అలియాస్ హర్షా రెడ్డి అలియాస్ బిట్టు తదితర మారుపేర్లతో చలామణి అయినట్లు పోలీసులు గుర్తించారు. ఇలా పలు పేర్లతో చలామణి అవుతూ.. రెండు తుపాకీలను తన వెంట ఉంచుకొంటూ.. నెలకు సింపిల్ గా ఓ చోరీ చేయడం అలవాటుగా బత్తుల ప్రభాకర్ మార్చుకొన్నాడు. హైదరాబాద్ లో నెలకు రూ. లక్ష అద్దె చెల్లిస్తున్నాడు. అంటే అతగాడు నివసిస్తున్న ఇల్లు ఏ రేంజ్ లో ఉంటుందో ఊహించుకోవచ్చు. ట్రిబుల్ బెడ్ రూం ప్లాట్ ని జిమ్ గా మార్చేసి నిత్యం ఫిట్ గా ఉండేలా ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు విచారణలో తెలింది. అంతేకాదు.. నెలకు రూ.10 వేలు ఇచ్చి.. వంట అమ్మాయిని సైతం పెట్టుకొన్నాడు. ఇంజనీరింగ్ కాలేజీలే లక్ష్యంగా చేసుకొని చోరీ చేస్తున్న అతడి వేస్తున్న స్కెచ్ లకు పోలీసులే నిశ్చేష్టులయ్యారంటే అతగాడి పని తనం ఏ రేంజ్ లో ఉందో స్పష్టమవుతోంది. 2013 నుంచి చోరీలు చేయడం ప్రారంభించిన బత్తుల ప్రభాకర్ స్వస్థలం చిత్తూరు జిల్లా. అతడు చోరీలు చేయడం ప్రారంభించిన తర్వాత... దాదాపు ఏడుసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. అయితే జైల్లో ఉన్న సమయంలో తనను వేధించిన ఖైదీలను హత్య చేయాలని ప్లాన్ సైతం వేశాడు. అందుకోసం బిహార్ నుంచి మూడు గన్ లతోపాటు 300 బుల్లెట్లను సైతం కొనుగోలు చేసి తెప్పించుకొన్నాడు. ఇక అతగాడి శరీరంపై 3 అంకె, శిలువ గుర్తుతోపాటు 100 అని పచ్చ బొట్టు సైతం పొడిపించుకొన్నాడు. అందుకు 3 అంటే 333 కోట్లు సంపాదించడమని, అలాగే 100 అంటే అమ్మాయిలను అనుభవించడమని పోలీసుల విచారణలో అతడు పేర్కొన్నట్లు సమాచారం. అతడు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని ఖరీదైన విల్లాల్లో నివసిస్తాడు. ఓ వేళ పోలీసులు లేదా ఎవరికైనా అతడి వ్యవహార శైలిపై అనుమానం వస్తే.. వెంటనే ఇల్లు మార్చేస్తాడు. అదీకాక పోలీసుల తనిఖీల్లో అతడి నివాసంలో వందలాది బుల్లెట్లు చూసి వారు అవాక్కయినట్లు సమాచారం. ఇక అతడు గన్ ఎలా కాల్చలనే విషయాన్ని సైతం సొంతంగా నేర్చుకొన్నాడు. మరోవైపు 2020లో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమెను వదిలేశాడు. తాజాగా ఒడిశాకు చెందిన యువతితో సహజీవనం చేస్తున్నాడు. ప్రిజం పబ్ లో కాల్పుల ఘటనను కొద్దిరోజుల ముందు ఆ యువతిని ఒడిశాకు పంపాడు. అయితే ఈ బత్తుల ప్రభాకర్ కోసం నాలుగు రాష్ట్రాల పోలీసులు గాలిస్తున్నారు. ఇన్ని రకాలుగా చెడ్డ పనులు చేస్తూ.. అక్రమ సంపాదనతో దర్జాగా చలామణి అవుతోన్న అతడు జైలు నుంచి బయటకు వస్తే.. మళ్లీ పాత పంథానే అనుసరిస్తారనే ఓ చర్చ సైతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## ఇదేనా ప్రజాపాలన?

-మొదటిపేజీ తరువాయి

నాచారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అందించడం లేదంటూ పలు వార్తపత్రికలు ప్రచురించాయి. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికలకు వివాదం తలెత్తడంతో పిల్లలకు అన్నం పెద్దలేదన్న వార్తలు వెలువడ్డాయి. కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు కార్మికులు అరకొరగా భోజనం అందిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆహారం నాణ్యతా లోపించడంతో వారి పస్తులు ఉంటూ తిరిగి ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారు. మరోవైపు నిన్న(శుక్రవారం) పాఠశాల ప్రిన్సిపల్, మధ్యాహ్న భోజన కార్మికులకు మధ్య వివాదం నెలకొంది. దీంతో విద్యార్థులకు నిన్న భోజనం అందించలేదు. దీనిపై చిన్నారులు తమ తల్లిదండ్రులకు విషయం చెప్పగా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న డీఈవో నేరుగా పాఠశాల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్, వంట ఏజెన్సీ కార్మికలపై సీరియస్ అయ్యారు. దీనికి సంబంధించిన వార్తా పత్రికల క్లిపింగులను కేటీఆర్ తన ట్వీట్‌కు జత చేశారు.

**కేటీఆర్ ట్వీట్..**

"పేదల గూళ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ.. బడిపిల్లలకు బుక్కెడు బువ్వపెట్టడంలో లేదా?. అమృత్ స్కీమ్‌ను అప్పనంగా బామ్మర్దికి కట్టబెట్టడంలో ఉన్న తెలివి, బుక్కెడు బువ్వకు అలమటిస్తున్న పసిపిల్లల కడుపు నింపడంలో లేదా?. పారిశ్రామికవేత్త అదానీకి తెలంగాణ వనరులు దోచిపెట్టడంలో ఉన్న శ్రద్ధ.. ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా?. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంలో ఉన్న ప్రేమ.. భవిష్యత్ భారతావని వారసులైన పసిపిల్లల ఆకలి కేకలపై లేదా?. మంత్రుల సంగతి దేవుడెరుగు, ముఖ్యమంత్రి ఇలాకాలోనే పిల్లల పస్తులు ఉంటున్నారు. మీ ఢిల్లీ బాసులు.. మీ గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు రేవంత్.. ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టు. ఒక్కపూట ఫొటోలకు ఫోజులిచ్చి గప్పాలు కొట్టడం కాదు. నిత్యం గుప్పెడు అన్నం అందుతుందో లేదో సమీక్ష చేసి చూడు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలను వేధించే పాలన" అంటూ ట్వీట్ చేశారు.ఖ

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు

-మొదటిపేజీ తరువాయి

పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో నమోదయ్యాయని అన్నారు. వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి




స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు.అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప కూడా దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనమని అన్నారు. ఆస్పత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

# స్మార్ట్ వ్యవసాయంతో అధిక లాభాలు

వ్యవసాయ క్షేత్రంలో నీరుపెట్టాలంటే ఇంటి నుండి లేదా మనం ఎక్కడ ఉన్నా కూడా మోటర్ వేసి నీరు పెట్టవచ్చు. మందు కొట్టాలన్నా మనం ఎక్కడో ఉండి కూడా ఆపరేట్ చేయవచ్చు. ఇలా మన మొబైల్లో సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని డిజిటల్ వ్యవసాయం చేస్తూ అనేక లాభాలను రైతులు అర్జిస్తున్నారు. వివిధ పంటలకు మందులను పిచికారి చేయడం, నీరు కట్టడం, ఔషధాలను వేయడం, వరినాటు నాటడం, కలుపు తీయడం, పాలు పితకడం వంటి వాటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అతి సులభంగా చేస్తున్నారు రైతులు. ప్రపంచంలో నేడు అత్యంత ముఖ్యమైన సమస్య ఆహార సరఫరా. గత 35 ఏళ్లలో జనాభా పెరుగుదల రేటు కంటే ఆహార డిమాండ్ రెండింతలు పెరిగింది. వాస్తవానికి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో దాదాపు 10% లేదా 815 మిలియన్ల మంది ప్రజలు పోషకాహార లోపంతో ఉన్నారు. చురుకైన, ఆరోగ్యకరమైన జీవితాలను గడపడానికి తగినంత ఆహారం లేదు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విస్తృతమైంది. రైతులకు అనేక విధాలుగా సహాయం చేసింది. మెరుగైన సాంకేతికతలను స్వీకరించడం వల్ల పంటల ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది. ఇది ఉత్పత్తి ఖర్చును తగ్గించడంలో కూడా సహాయపడింది. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో ఉపయోగించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది. సాంకేతికత వినియోగం కూడా వ్యవసాయ ప్రక్రియను సులభతరం చేసింది. వ్యవసాయ సాంకేతికత వేల సంవత్సరాల నాటిది. ఏదిఏమైనప్పటికీ మెరుగైన ప్రణాళిక, చురుకైన నిర్వహణ ద్వారా పంట దిగుబడిని పెంచడానికి వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం దీని ప్రాథమిక దృష్టి. మరింత సమర్థవంతమైన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయంలో అధునాతన సాంకేతికత నేటి వ్యవసాయ వ్యాపారంలో రైతులు అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది. యంత్రాలు, ఉపగ్రహ చిత్రాలు లేదా ప్రత్యేక వ్యవసాయ సాఫ్ట్‌వేర్‌తో క్షేత్ర ఉత్పాదకతను పర్యవేక్షించడం వంటి పంట భ్రమణం, కొత్త వ్యవసాయ సాంకేతికతలు వంటి సమయ -పరీక్షా పద్ధతులు వ్యవసాయం సాధ్యతకు దోహదం చేస్తాయి. వ్యవసాయ ఉత్పత్తిని మెరుగుపరిచే విస్తృత పరికరాలు వున్నాయి. వాటిలో వాహనాలు, రోబోటిక్స్, కంప్యూటర్లు, ఉపగ్రహాలు, డ్రోన్లు, మొబైల్ పరికరాలు, సాఫ్ట్‌వేర్ ఉన్నాయి. వ్యవసాయంలో బిగ్‌డేటా అనలిటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించడం కూడా వ్యవసాయ రంగం సాంకేతిక పురోగతిగా చెప్పవచ్చు. ప్రతి సంవత్సరం కొత్త కొత్త వ్యవసాయ ఆవిష్కరణలు జరుగుతున్నాయి. అగ్రి బిజినెస్ ఆధునీకరించడం, అభివృద్ధి చెందడం కొనసాగిస్తున్నందున, వ్యవసాయ, ఆహార ఉత్పత్తి దారులు, సాంకేతిక నిర్వాహకులు తాజా సాంకేతిక ప్రమాణాలతో రూపొందించడం జరుగుతున్నది. ఆధునాతన సాంకేతికతలు జంతువుల పెంపకం, సంరక్షణను మెరుగుపరచడానికి, అలాగే వ్యవసాయ నిర్వహణ, మొత్తం ఉత్పాదకతను ఆప్టిమైజ్ చేయడానికి సెన్సార్లు, డేటా, ప్రాసెసింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించడానికి రైతులు ఉత్సాహం చూపుతున్నారు. రిమోట్ మానిటరింగ్ టెక్నాలజీలు గతంలో కంటే జంతువుల ఆరోగ్యం, సంక్షేమంపై మరింత డేటాను అందిస్తాయి. 20 వ శతాబ్దంలో సింథటిక్ ఎరువులు, పురుగుమందుల అభివృద్ధితో సహా వ్యవసాయ సాంకేతికతలలో పెద్ద పురోగతి కనిపించింది. పురుగు మందుల వైమానిక వినియోగానికి భారీ -ఉత్పత్తి ట్రాక్టర్లు, వ్యవసాయ విమానాలతో సహా కొత్త వ్యవసాయ యంత్రాలు ఉన్నాయి. ఇటీవలి పురోగతులలో వ్యవసాయ ప్లాస్టిక్‌లు, జన్యుపరంగామార్పు చెందిన పంటలు, మెరుగైన బిందుసేద్యం, సమీకృత తెగులు నిర్వహణ, హైడ్రోపోనిక్స్, ఆక్వాపోనిక్స్, ఏరోపోనిక్స్ వంటి నేలలేని వ్యవసాయ పద్ధతులు ఉన్నాయి. 21వ శతాబ్దపు మొదటి దశాబ్దాలలో సమాచార సాంకేతికతలు వ్యవసాయానికి ఎక్కువగా వర్తింపజేయబడ్డాయి. ఆధునిక వ్యవసాయ సాంకేతికతలతో పొలాలకు సాధికారత కల్పించడం జరుగుతున్నది. లేజర్ ల్యాండ్ లెవలింగ్, రోబోటిక్ రైతులు, పంటలు, నేలకోసం అధునాతన సెన్సార్లు, ఆప్టిమైజ్డ్ లైట్ మేనేజ్‌మెంట్, ఐసొబస్ టెక్నాలజీ, ఎఐ ద్వారా వాతావరణం, వాతావరణ అంచనా, డ్రిప్‌లు, మల్చింగ్ వంటి వాటిని విరివిగా వాడుతున్నారు. పంట ఉత్పత్తి ప్రధానంగా భూసార పరీక్ష, నిర్దిష్ట ప్రదేశంలో వాతావరణం ద్వారా నిర్ణయించబడుతుంది. వ్యవసాయ డిజిటలైజేషన్ వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తోంది, పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి వేగం పుంజుకుంది. విజయవంతమైన సాగుచక్రాన్ని నిర్ధారించడానికి వివిధ వాటాదారులు, రైతుల మధ్య సహకారాన్ని ఎనేబుల్ చేయడానికి వ్యవసాయం డిజిటలైజేషన్ అంతర్భాగంగా మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించే రైతులు అధిక దిగుబడి, లాభదాయకతతో సహా గణనీయమైన ప్రయోజనాలను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నారు. సకాలంలో ఖచ్చితమైన సమాచారాన్ని యాక్సెస్ చేయడం ద్వారా వారు మెరుగైన ఫలితాలకు దోహదపడే మరింత ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోగలరు. డిజిటల్ వ్యవసాయం అంటే వ్యవసాయంలో డేటా ఎకోసిస్టమ్‌లు, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటలైజేషన్‌ను ఉపయోగించడం.దీని ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా, స్థిరం గా, సమర్థవంతంగా చేయవచ్చు. డిజిటల్ వ్యవసాయం వల్ల వ్యవసాయ సామర్థ్యం పెరుగుతుంది, దిగుబడులు పెరుగుతాయి, పర్యావరణ ప్రభావం తగ్గుతుంది. వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులను తగ్గించడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం చేయడం, కార్మికుల కొరతను తగ్గించడం, వనరులను సమర్థవంతంగా వినియోగించడం, గ్రామీణాభివృద్ధికి సహాయపడడం వంటివి సాంకేతిక డిజిటల్ వ్యవసాయం లక్ష్యాలుగా చెప్పవచ్చు.

# ఆదర్శమూర్తి బాబా ఆమ్టే



నిస్వార్థ సేవకు నిలువెత్తు సంతకం బాబా ఆమ్టే. భరతమాత ముద్దు బిడ్డ, చురుకైన సామాజిక కార్యకర్త, క్రియాశీల సంఘ సేవకులు, సంఘ సంస్కర్త, పర్యావరణ హితవరి, బడుగుల గిరిజనుల అభ్యున్నతి కాంక్షించిన ఆదర్శమూర్తి, పేదల పక్షపాతి, కుష్టురోగుల రోగుల పాలిట నరుడి రూపంలో ఉన్న నారాయణుడు అయిన బాబా ఆమ్టే తన 93 ఏండ్ల జీవితాన్ని ప్రజాసేవకు మాత్రమే అంకితం చేశారు. మహారాష్ట్ర హింగన్‌ఘాట్‌లో 26 డిసెంబర్ 1914న సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన మురళీధర్ దేవిదాస్ చిన్నపాటి నుండే అసమానతల భారత సమాజాన్ని అర్థం చేసుకున్నారు. బి. ఎ.తో పాడు ఎల్‌ఎల్‌బి పూర్తి చేసిన మురళీధరుడు వార్ధాలో కొంతకాలం న్యాయవాదిగా నాటి స్వాతంత్ర్య యోధుల పక్షాన నిలిచి కోర్టుల్లో వారికి న్యాయం అందే విధంగా తన అమూల్య సేవలు అందించారు. స్వాతంత్ర్య సమరంలో నేరుగా పాల్గొంటూనే గాంధీ సేవాగ్రామ్ ఆశ్రమంలో తన సేవలకు అందిస్తూ గాంధీ గారి అభిమానిగా, శిష్యులుగా మారిపోయి గాంధీయిజమ్‌ను ఒంటపట్టించుకున్నారు. ఖాళీ బట్టలను వాడుతూ, నూలు వడకడం నేర్చుకున్నారు. ఒక రోజు తులసీరామ్ అనే కుష్టువ్యాధిగ్రస్తుడిని చూసి చలించిన ఆమ్టే, వారి పట్ల పౌరసమాజం చూపుతున్న చిన్నచూపు, అంటకుండా దూరంగా ఉంచడంతో పాటు సామాజిక నిరాదరణను చూసి నిరసించారు. కుష్టురోగుల పట్ల ఆదరణ, ఆత్మ విశ్వాసాలను నింపడానికి ముందురావడానికి పౌర సమాజాన్ని జాగృత పరచాల్సిన అవసరాన్ని గుర్తించి ఆ దిశగా పటిష్ట అడుగులు వేశారు. ఈ దిశలో ఆమ్టే ఒక నిర్ణయం తీసుకొని కుష్టురోగులతో కలిసి ఆశ్రమంలో జీవిస్తూనే వారి శ్రేయస్సు చూడడం, వైద్య సదుపాయాల కల్పన, వారిలో వృత్తి నైపుణ్యాలు పెంచడం, నయం అయిన వారికి పునరావాస కల్పన, కుష్టురోగుల పట్ల సమాజ స్పందన మార్చడానికి కృషి చేశారు. మురళీధర్ సేవలను గుర్తించిన పౌర సమాజం వారిని ప్రేమతో "బాబా ఆమ్టే"గా పిలవడం ప్రారంభించారు. ఆమ్టేతో పాటు వారి సతీమణి సాధన ఆమ్టే కూడా అదే బాటలో నడుస్తూ భర్తకు తగిన భార్యగా పేరు తెచ్చుకున్నారు. ఇదే క్రమంలో మూడు ఆశ్రమాలను నడుపుతూ, వారి కోసం 1949లో ఆసుపత్రిని ఏర్పాటు చేసి కుష్టురోగుల పాలిట దేవుడిగా నిలిచారు. 1973లో గర్చిరోలి జిల్లాలో గోండు గిరిజనుల దీనస్థితులను చూసి "లోక్ బిరాదారి ప్రకల్ప్"ను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేశారు. 1990లో 'సర్దార్ సరోవర్ డ్యామ్' నిర్మాణంతో పర్యావరణం విచ్ఛిన్నం అవుతుందని మేధా పాట్కర్ ప్రారంభించిన "నర్మదలా బచావో ఆందోళన్"లో పాల్గొని తన పర్యవరణ ప్రేమను రుజువు చేసుకున్నారు. క్విట్ ఇండియా ఉద్యమం, వన్యప్రాణి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, జాతీయ సమైక్యత, గిరిజనాభివృద్ధి లాంటి రంగాల్లో విశేష కృషి చేశారు. బాబా ఆమ్టే చేసిన సంఘ సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మశ్రీ (1971), మెగసెసె అవార్డు(1985), పద్మ భూషన్(1986), రాష్ట్రీయ భూషన్(1978), జమ్నాలాల్ బజాజ్ అవార్డు(1979), ఇందిరాగాంధీ స్మారక అవార్డు(1985), ఐరాస మానవ హక్కుల గాంధీ పీస్ ప్రైజ్(1999), మహారాష్ట్ర భూషన్ అవార్డు(2004) లయతో పాటు మరో 30కి పైగా ప్రతిష్టాత్మక అవార్డులు పొందారు. యూనివర్సిటీల చేత మూడు డి లిట్ టైటిల్స్, పలు గౌరవ డాక్టరేట్లు స్వీకరించారు మన బాబా ఆమ్టే. దేశికోత్తమ్, అభయసాధక్, కృషి రత్న లాంటి పలు బిరుదులు కూడా పొందడం విశేషం. బాబా ఆమ్టే దంపతుల నుండి ప్రేరణ పొందిన వారి ఇరువురు సుపుత్రులు (వికాశ్, ప్రకాశ్ ఆమ్టేలు), ఇద్దరు కోడల్లు (మందాకిని, భారతి) కూడా వైద్యులుగా కుష్టు రోగులకు ప్రత్యేక ఆశ్రమాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థలు ఉచితంగా పేదల కోసం నడిపిస్తున్నారు. తన 93వ ఏట తను స్థాపించగా ఆశ్రమంలోనే 09 ఫిబ్రవరి 2008న తుది శ్వాస విడిచిన బాబా ఆమ్టే నిస్వార్థ జీవితం నేటి పౌర సమాజానికి, ముఖ్యంగా యువభారతానికి ప్రేరణగా నిలవాలని కోరుకుందాం, వారు చూపిన సంఘ సేవ బాటలో నడుస్తూ మన జన్మలను పునీతం చేసుకుందాం.

# గుండెజబ్బులపై అవగాహన ఆవశ్యకత



హృదయ వ్యాధి ఈ రోజు ప్రపంచంలోనే నంబర్ వన్ కిల్లర్. జీవితంలో కొన్ని చిన్న మార్పులు చేయడం ద్వారా, మన గుండె జబ్బులు మరియు స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.ప్రతి ఒక్కరు గుండె జబ్బులపై అవగాహన పెంచుకొని గుండె జబ్బులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసు కోవాలి. మన శరీరంలోని మిగిలిన భాగాల కంటే కొద్దిగా భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఇతర శారీరక అవయవాలు మన శారీరక ఆరోగ్యానికి చాలా అవసరం అయితే, గుండె మన మానసిక ఆరోగ్యానికి కూడా చాలా అవసరం. ప్రతి సంవత్సరం గుండె జబ్బులు పెరుగు తున్నాయి. గుండెకు సంబంధించిన సమస్యలు ఎక్కువ కావడానికి మన జీవన విధానం ముఖ్యమైన కారణమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గుండెను ఆరోగ్యంగా చూసుకోవడం, వ్యాధి రాకుండా అవగాహన కలిగించడం మొదలైన అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజున ప్రచారం చేస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంయుక్తంగా దాదాపు 100 దేశాలలో 196 కార్డియాలజీ సొసైటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఆరోగ్య తనిఖీలు నిర్వహించడం, నడక పరుగులకు సందబంధించిన ఆటలు ఆడించడం, బహిరంగ చర్చలు సైన్స్ ఫోరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యక్తులు, కుటుంబాలు, సంఘాలు, ప్రభుత్వాలు మొదలైనవి గుండె ఆరోగ్యం, ఇతరుల బాధ్యతలను స్వీకరించే కార్యకలాపాల్లో పాల్గొంటాయి. ఈ ప్రచారం ద్వారా అన్ని దేశాల ప్రజలను ఏకంచేసి, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య కరమైన జీవితాన్ని ప్రోత్సహించడానికి అంతర్జాతీయ కార్యక్రమా లను నడిపిస్తుంది. గుండె జబ్బులు రావడానికి కారణాలను పరిశీలిస్తే...మారిన ఆహారపు అలవాట్లు, సిగరెట్లు, మందు తాగడం, శరీరానికి అవసరమైన వ్యాయామం లేకపోవడం, ఉబకాయం ఇవన్నీ గుండె జబ్బులకు దారితీస్తా యని వైద్యులు చెపుతున్నారు. దశాబ్ద కాలం క్రితం వరకూ ఆసుపత్రిలో హృద్రోగంతో బాధపడే స్త్రీల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఇప్పుడు పురుషులతో సమానంగా స్త్రీల సంఖ్య కూడా ఉంటోంది. దీనికి ఒకటే కారణం స్త్రీలు కూడా పురుషులతో సమానంగా సిగరెట్లు, మద్యం తాగడం అంటున్నారు నిపుణులు. గుండెకు సంబంధమైన వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే జీవిత కాలాన్ని మరికొంత కాలం సుఖ సంతోషాలతో గడపవచ్చు. వివిధ రకాల గుండె జబ్బులతో బాధపడుతున్న వ్యక్తులు సాధారణ చిట్కాలను పాటించటం ద్వారా నివారించ వచ్చు. వ్యాయామం, శారీరక శ్రమ: అంటే మీరు ప్రతి రోజూ చేసే పనిలో శారీరక శ్రమను కూడా భాగం చేసుకోవాలి. అంటే సైకిల్ తొక్కడం, మెట్లను ఎక్కడం, వీలైనప్పుడంతా నడవడం చేయాలి. శుభ్రమైన గాలి పీల్చడానికి నడవాల్సి వస్తే నడవాలి. రోజుకు రెండు సార్లు స్ట్రెచ్చింగ్ వ్యాయామాలు ఐదు నిమిషాల పాటు చేయొచ్చు. ఈ చిన్న చిన్న శ్రమలన్నీ ఆరోగ్య ఖాతాలో పడతాయి. ఆహారం, పండ్లు మరియు కూరగాయలలో ఫైబర్ తో పాటుగా, విటమిన్లు, ఖనిజాలు మరియు అనామ్ల జనకాలు, పొటాషియం సమృద్ధిగా ఉంటాయి. రక్తపోటు నిర్వహణ విషయానికి వస్తే తినే ఆహారంలో పొటాషియం పెంచడం, సోడియం తగ్గించడం చాలాముఖ్యం. పొటాషియం, సోడియం ప్రభావాలు తక్కువ, అధిక రక్తపోటులకు సహాయం చేస్తాయి. సిట్రస్ పండ్లు, అరటిపండ్లు, బంగాళా దుంపలు, టమాటాలు మరియు బీన్స్ లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. అలాగే తేలిక ఆహారాలను తీసుకోవాలి. ఇటీవల ఒక అధ్యయనం ప్రకారం తెల్ల పండ్లు మరియు కూరగాయలు (ఆపిల్స్, దోసకాయలు, కాలీఫ్లవర్ వంటి) అధికంగా తిన్న ప్రజలకు స్ట్రోక్ వచ్చే ప్రమాదం 52 శాతం తగ్గిందని తేలింది. గుండె పోటుకు ప్రధాన కారణం మానసిక ఒత్తిడి. ఒక వ్యక్తి అధిక మానసిక ఒత్తిడికి గురైనప్పుడు, ఆ వ్యక్తికి గుండె పోటు వస్తుందని గమనించి ఉండవచ్చు. కాబట్టి అతిగా ఆందోళన చెందకుండా సంతోష మైనా లేదా విచారకరమైన మానసిక స్థితి కానీ ఎక్కువ ఉద్వేగానికి లోనవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు యోగా సహాయ పడుతుంది. మన గుండె ఒక పంపులా పనిచేస్తూ శరీరంలోని అన్ని భాగాలకు రక్త సరఫరా చేస్తుంటుంది. మామూలు పంపులు పని చేయటానికి విద్యుత్తు అవసరమైనట్టే మన గుండె నిరంతరం కొట్టు కోవటానికి కూడా శక్తి కావాలి. ఇందుకు గుండె పైగదుల్లో కుడి వైపున సైనో ఏట్రియల్ నోడ్ (ఎస్‌ఏ నోడ్), ఏట్రియో వెంట్రిక్యులార్ నోడ్ (ఏవీ నోడ్) అనే కేంద్రాలుం టాయి. వీటి నుంచి నిరంతరం విద్యుత్ ప్రేరేపణలు వెలువడు తుంటాయి. 'ఎస్‌ఏ నోడ్' నుంచి వెలవడే విద్యుత్ ప్రేరణలు గుండె పైగదుల్కైన కుడి కర్ణిక నుంచి ఎడమ కర్ణికకు చేరుకొని.. అవి రెండూ మూసుకునేలా చేస్తాయి. దాంతో రక్తం వేగంగా నెట్టినట్టుగా కింది గదుల్కైన జఠరికల్లోకి వస్తుంది. అప్పుడు 'ఏవీ నోడ్' నుంచి వెలువడే విద్యుత్ ప్రేరణలు జఠరికలు మూసుకునేలా చేస్తాయి. ఇదంతా ఒక క్రమపద్ధతిలో, లయాత్మకంగా, నిరంతరాయంగా జరుగు తుండటం వల్ల రక్తం ధమనుల్లోకి పంప్ అవుతుంది. అయితే కొన్నిసార్లు రకరకాల సమస్యల కారణంగా ఈ విద్యుత్ ప్రేరణలు గతితప్పి, గుండె లయ దెబ్బ తినొచ్చు. దీన్నే 'అరిత్మియాసిస్' అంటారు. దీంతో గుండె కొట్టుకునే వేగం క్రమంగా తగ్గటం (బ్రాడీకార్డియా), అనూహ్యంగా పెరగటం (టెకీకార్డియా) వంటి పరిస్థితులు తలెత్తవచ్చు. హార్ట్ ఎటాక్ కు కార్డియాక్ అరెస్టుకు తేడా ఉంది. కరోనరీ ధమనులు (కరోనరీ ఆర్టెరీస్)లో బ్లాకులు ఏర్పడినప్పుడు హార్ట్‌ఎటాక్ వస్తుంది. గుండె కండరానికి (కార్డియాక్ మజిల్) రక్త ప్రసరణ చేసే రక్త నాళాలనే కరోనరీ ధమనులు అంటారు. అలా బ్లాకులు ఏర్పడి నప్పుడు గుండెకు ఆక్సిజన్? నిండిన రక్తం అందదు. ఆ బ్లాకులు త్వరగా తెరుచు కోకపోతే మనిషి చనిపోతాడు. ఇక కార్డియాక్ అరెస్టు అంటే...ఒక్కసారిగా గుండె.. రక్త సరఫరాను ఆపేస్తుంది. మెదడుకి ఆక్సిజన్ అందదు. అప్పుడు మనిషి ఒక్కసారిగా కుప్పకూలి, ఊపిరాడక స్పృహ కోల్పోతాడు. గుండె కొట్టుకోవడం పూర్తిగా ఆగిపోతుంది. దీనినే కార్డియాక్ అరెస్ట్ అంటారు. కొందరు తరచూ కెరీర్, ఆర్థిక పరమైన ఒత్తిళ్లు ఎదుర్కొంటూ ఉంటారు. ఈ ఒత్తిడి గుండె పని తీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న మనిషి గుండె నిమిషానికి 70 నుంచి 80 సార్లు కొట్టు కుంటుంది. మనిషి ఒత్తిడికి గురైనప్పుడు గుండె వేగం 120 నుంచి 150సార్లకు పైగా కొట్టు కుంటుంది. గుండె నుంచి ఇతర శరీర భాగాలకు రక్త ప్రసరణ వేగంగా సాగాల్సిన సమయంలో రక్త నాళాలు చిన్నవిగా కుచించుకు పోతాయి. అప్పటి వరకూ రక్తనాళాల్లో బ్లాకులు లేక పోయినా.. ఒత్తిడి వల్ల అవి కుచించుకు పోయి సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు కారణం అవుతుంది.

వాస్తవ నేస్తం

# స్థానిక వార్తలు

## బ్లూ భీమ్ యూత్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ల పంపిణి




**వాస్తవ నేస్తం,తలమడుగు:** సామజిక సేవే లక్ష్యం గా ముందుకు వెళ్తున్నామని బ్లూ భీమ్ యూత్ అధ్యక్షులు ప్రేమేందర్ తెలిపారు శుక్రవారం మండల కేంద్రం లో గల జడ్పీ హెచ్ స్ పాఠశాల లో గల విద్యార్థుల కు యూత్ సభ్యుడు మామిడి అశోక్ జన్మదిన సందర్బంగా ప్యాడ్ లను పంపిణి చేశారు ఈ సందర్బంగా ఎం ఈ వో వెంకట్రావ్ మాట్లాడుతూ సామజిక సేవలో బ్లూ భీమ్ యూత్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని వారు ఇంకా మునుముందు సేవలు కొనసాగించాలి అభినందించారు ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు రాజేందర్ మురళీధర్ సుమలత యూత్ సభ్యులు అరవింద్ వినయ్ తదితరులు పాల్గొన్నారు

## ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అధికారుల భూసర్వే.. లగచర్లలో ఉద్రిక్తత

**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అధికారుల భూసర్వే నిర్వహించారు. లగచర్లలో 200 మంది పోలీసులతో బందోబస్తుతో భూసర్వే చేపట్టారు. భూసర్వే చేయొద్దని రోటీబాండ తండాలో గ్రామస్థులు, స్థానికులు నిరసన తెలిపారు. నవంబర్ 11న లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణపై రైతుల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్ పై అక్కడి రైతులు, ప్రజలు దాడి చేసిన విషయం తెలిసిందే. లగచర్లతో పాటు హకీంపేట, పోలేపల్లిలో ఫార్మా విలేజీల కోసం 1,358 ఎకరాల భూసేకరణ ప్రతిపాదనలను ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. లగచర్లలో అధికారులపై జరిగిన దాడి కేసులో గ్రామస్థులను అరెస్టు చేసిన విషయం విధితమే.

## బీసీ గురుకుల బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన

**భద్రాద్రి కొత్తగూడెం** పాల్వంచ మహాత్మ జ్యోతి బాపులే బీసీ బాలికల గురుకుల విద్యాలయం ను గురువారం రాత్రి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆమె తరగతి గదులకు ప్రవేశించి స్టడీ అవర్ లో విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉపయోగించుకునే టాయిలెట్స్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే పరిశుభ్రమైన తాగునీటిని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, విద్యాలయ సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెన్షనర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన విశ్రాంత ఉద్యోగులు సంఘం.

**భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు పెన్షనర్స్ కు సంబందించి న నెలవారీ భత్యం రావటానికి విశేష కృషి కల్పి ప్రభుత్వాలను ఒప్పించి పెన్షన్ మంజూరి చేయించిన ఘనత డి.ఎస్.నఖారాకి దక్కుతుంది. ఈ సందర్భనీగా అతనికి విశ్రాంత ఉద్యోగులు అందరూ వారి సేవలను గుర్తుచేసుకుని పెన్షన్ ర్స్ డే గా జరుపుకొని వారి సేవలను కొనియాడారు. ఇందులో భాగం గా సీనియర్ విశ్రాంత ఉద్యోగులు 18 మంది ని శాలువలతో సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమ నిర్వహణ గురించి విశ్రాంత ఉద్యోగులు సంఘం అధ్యక్షులు భూషణ్ రావు మాట్లాడుతూ నకారా చిత్రానికి పూలమాలతో సత్కరించి సంఘం చేస్తున్న విశిష్ట సేవలు కంటి ఆపరేషన్స్ , అర్తో సేవలు, అన్నదానం, లైఫ్ సర్టిఫికెట్ కాంప్స్, పేదలకు ఆర్థిక సహాయం, యితర కార్యక్రమాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వెంకన్న,సెక్రటరీ, హనుమనీత్ రావు, తిప్పన సిద్దులు, లయన్ డాక్టర్. గోళ్ల భూపతి రావు, రాష్ట్ర భాద్యులు శరత్, డాక్టర్. విజయా రావు, జిల్లా అధ్యక్షులు జాన్ వెస్లి, అనందకుమార్ , ప్రసాద్ విష్ణు రావు ఏ టీ వో, మాణిక్య కుమారి, తులసీదాస్, ప్రజా నాయకులు వెంకట రెడ్డి, ఐ.రమాకాంత్ ఇతరులు పాల్గొన్నారు.

## కులగణనలో తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలి : మంత్రి పొన్నం

**హైదరాబాద్ :** కులగణనలో ఏ తప్పుల లేవని, ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిసిలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, సబ్‌ప్లాన్, పథకాల రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో పొన్నం మీడియాతో మాట్లాడారు. కులగణన భారత దేశం మొత్తం చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటామా? అని ప్రశ్నించారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలనే డిమాండ్ ఉందని, ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా పూర్తి చేసిందని పొన్నం కొనియాడారు. తెలంగాణ ప్రజలు ఇష్టపూర్వకంగా సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొనలేదని, ఆవహేళన మాత్రం చేశారని ధ్వజమెత్తారు. సర్వేలో పాల్గొన్న వాళ్లకే మాత్రమే కులగణనపై మాట్లాడే అవకాశం ఉంటుందని చురకలంటించారు. బిఆర్ఎస్ నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణన చేయడంలేదని మోడీ ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చిందని, బిజెపి పార్టీ ప్యూడలిస్టిక్ పార్టీ అని పొన్నం ధ్వజమెత్తారు.

## వైకాపాలో చేరిన కాంగ్రెస్ నేత శైలజానాథ్

**అమరావతి : :** మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సాకె శైలజనాథ్ శుక్రవారం నాడు వైకాపా లో చేరారు . వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి అయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు శైలజానాథ్ మాట్లాడుతూ జగన్ నాయకత్వంలో పని చేస్తూ, ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుని ప్రజల పక్షాన పోరాడాలని నిర్ణయించుకున్నాను. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు. మరోవైపు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేయడం ద్వారా, పేదలకు వైద్య విద్య దూరం చేస్తున్నారు. గతంలో జగన్గారు విద్యా రంగంలో చేసిన అమలు చేసిన అనేక సంస్కరణలను ఈ ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది.

# ఆధ్యాత్మిక మార్గమే.. మోక్ష మార్గం

### వైభవంగా శబరిమాతా ఆలయ వార్షికోత్సవ వేడుకలు.. కన్నుల పండువగా పల్లకి ఊరేగింపు

**వాస్తవ నేస్తం ఇచ్చోడ :** నేటి సమాజంలో ఆధ్యాత్మిక మార్గం అవలంబించిన వారికి మోక్ష మార్గం తప్ప కుండా లభిస్తుందని శ్రీ శ్రీ బాలన్న మహారాజ్, శ్రీ శ్రీ దేవానంద్ మహారాజ్ అన్నారు. మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామంలో శబరిమాత ఏడవ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం భక్తులు వైభవంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా వారు భక్తులకు ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో ఆయా మతాలకు చెందిన బాబాలు, సాధువులు, ఋషులు, మునులు ప్రజలకు సన్మార్గాల వైపు మల్లించేలా ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉపదేశిస్తుండటంతో సుఖ శాంతులు వెల్లివిరుస్తున్నా యని వారు పేర్కొన్నారు. ధర్మంలోనే పరమార్థం ఉందని వారు ఉద్బోదించారు.

**కన్నుల పండువగా పల్లకి ఊరేగింపు...**

ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పల్లకిలో అమ్మవారి చిత్ర పటం, పాదుకలను కన్నుల పండు వగా ఊరేగించారు. అమ్మవారి భక్తి పాటలు పాడు తూ, నృత్యాలు చేస్తూ భక్తులు శోభాయాత్ర నిర్వ హించారు.



మంగళ హారతులతో స్వాగతం పలుకు తూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలను వీక్షిం చేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నరాల భోజన్న, రుద్రాక్ష సుదర్శన్, బీమా హన్మండ్లు, కాండ్లి విశ్వనాథ్, కొత్తల్కర్ వెంకట్రావ్, బామన్ పల్లి గణేశ్, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదాలు అరికట్టడంలో ప్రభుత్వ అధికారుల వైఫల్యం

### వలసలను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
### మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్

**నరసరావుపేట :** పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం చంద్రబాబు నాయుడు కాలనీ చెందిన పేదలు పొట్టకూటి కోసం ఉదయాన్నే నరసరావుపేట నుండి చిలకలూరిపేట వైపు మిరపకాయలు కోయటానికి ఆటోలో వెళుతూ ఉండగా కనపర్తి దగ్గరకు వెళ్ళేసరికి అతివేగంగా వస్తున్న ఒక లారీ ఆటోని క్రాస్ చేస్తూ జరిగిన ప్రమాదంలో 18 మంది పేద వలస కూలీలు ప్రమాదానికి గురి అయ్యారు. తదుపరి నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం తీసుకురాగా ఒకరికి ఇబ్బందికరంగా ఉందని కొంతమందికి కాళ్లు చేతులు విరగటాన్ని చెప్పిన వైద్యులు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్ బాధితులను పరామర్శించారు. సంఘటన జరిగిన విషయాలపై జాన్ పాల్ పరిశీలించారు. అనంతరం జాన్ పాల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వలస కూలీలను అరికట్టడానికి ఏర్పాటుచేసిన ఉపాధి హామీ పథకం నీరు గారి పోవటం, ఆపదకు పేదలకు ఉపయోగపడకటం వలన, వలస కూలీలుగా చుట్టుపక్కల ప్రాంతాలకు పొట్టకూటికోసం ప్రతిరోజు ఉదయాన్నే వందలాదిమంది పేదలు ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వారికి ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం చెందాయని జాన్ పాల్ అన్నారు. అలాగే ప్రతిరోజు హైవేలలో యాక్సిడెంట్లు




అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించడంలో ప్రభుత్వ అధికారులు విఫలం చెందారని, ప్రభుత్వం వలస కూలీలలో అరికట్టటానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, ఇటువంటి ప్రమాదాల వలన కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్ ప్రభుత్వాన్ని చేశారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో మాల మహానాడు నరసరావుపేట నియోజకవర్గం వర్కింగ్ అధ్యక్షుడు వుస్తేల జయరావు, కొండా ప్రకాష్ తదితరులు వున్నారు.

## పలు వివాహ వేడుకలలో పాల్గొన్న మాజీ మంత్రి



**వనపర్తి :** పట్టణములో జరిగిన పలు వివాహ వేడుకలలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. బి.ఆర్.ఎస్ నాయకులు మురళీ సాగర్ ఆహ్వానం మేరకు అస్కాని సుభద్రమ్మ శ్రీనివాసులు కుమారుడు ఉదయ్ సాగర్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్వర్గీయ మొల్గరి.బాలస్వామి రిపోర్టర్ కుమారుడు సంతోష్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.పుల్లయగారి.రామేశ్వరమ్మ ఊసే నయ్య పాతపల్లి కుమార్తె అంజలి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.నిరంజన్ రెడ్డి గట్టు యాదవ్, నందిమల్ల.అశోక్, ఉంగ్లమ్. తిరుమల్,స్టార్.రహీమ్,గోవిందు నాయుడు,పెద్దముక్కల.రవి తదితరులు ఉన్నారు.

## దూడల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### ఏపీ ఎల్ డి ఏ డిడి రాజశేఖర్:: ఆదోని డిడి రమణయ్య

**కౌతాళం :** దూడల పెంపకంలో తగు జాగ్రతలు తీసుకుంటే దూడలు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటాయని ఏ పి ఎల్ డి ఏ రాజశేఖర్ మరియు ఆదోని డిడి రమణయ్య పేర్కొన్నారు. శుక్రవారం బాపురం గ్రామంలో ఏర్పటు చేసిన దూడల ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారు మాట్లాడుతూ . దూడలకు నట్టల నివారణ మరియు వ్యాక్సిన్లు వేయించాలని మూడు నెలలకు ఒకసారి డి వార్మింగ్ తాగించాలని కోరారు. పశు పోషణ ఆహార సమతుల్యంగా ఉండాలని సంపూర్ణ ఆహారాన్ని అందించాలని పోషకాలు గల ఆహారాన్ని అందించాలని సూచనలు అందించారు. పశువులలో ఈతకు కనీసం నాలుగు నుంచి ఐదు నెలలు మధ్య ఉండాలని సూచనలు ఇచ్చారు. ఎదకు వచ్చిన పశువులను 24 గంటల లోపల ఎద సూదులు వేయించాలని సూచించారు. అనంతరం పుట్టిన దూడలను ర్యాలీగా నిర్వహించారు. అనంతరం రైతులకు టిడిపి నాయకులు మోహన్ రెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అలపాటి రాజా ఎన్నికల నామినేషన్

### పిడుగురాళ్ల నుండి భారీగా తరలి వెళ్లిన కూటమి నాయకులు


**పిడుగురాళ్ల :** కృష్ణ,గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల నామినేషన్ కార్యక్రమం సందర్భంగా జిపి రెడ్డి గ్రూప్ స్కాలర్స్ జూనియర్ కాలేజీ యాజమాన్యం పిడుగురాళ్ల స్కాలర్స్ డైరెక్టర్స్ జి,శ్రీనివాసరెడ్డి ఎం,జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం,జనసేన,బిజెపి కూటమి, బలపరిచిన అభ్యర్థి మాజీ మంత్రి,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,ఆలపాటి రాజా కి సంఘీభావం తెలియజేస్తూ పిడుగురాళ్ల జిపి రెడ్డి స్కాలర్స్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో 20 కారులతో ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన పట్టణ అధ్యక్షులు పాండురంగ శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వడ్డవల్లి సర్వేశ్వరరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఖాసిం, బీసీ సెల్ అధ్యక్షులు వల్లెపు రామకృష్ణ, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ సైదా, రాష్ట్ర టీడీపీ కుమ్మర శాలివాహన సాధికార సమితి నాయకులు నడికుడి వెంకటేశ్వరావు, 6వ వార్డు ఇంచార్జి బిజ్జిలి వెంకట్రావు,12వ వార్డు ఇంచార్జి మొగిలి ఏడుకొండలరావు,16వ వార్డు ఇంచార్జి జమ్మిశెట్టి రామకృష్ణ, 20వ వార్డు ఇంచార్జి గోళ్ళ కిరణ్ కుమార్, 5వ వార్డు ఐటీడీపి కోఆర్డినేటర్ చాట్ల సునీల్, గంగయ్య, దూదేకుల ఖాసీం, స్కాలర్స్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పట్టభద్రులు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు జండాలు ఊపి నామినేషన్ కి ర్యాలీగా వెళ్తున్న కార్లను ప్రారంభించారు.

# ప్రజల మౌలిక వసతుల కల్పన ధ్యేయమే మా లక్ష్యం

### ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి సారధ్యంలో నందిగామ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం
### ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ :** ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం అట్టహా సంగా జరిగింది. ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారితో పాటు ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కౌన్సిలర్లు మరియు కూటమి నేతలు కాకానీ నగర్ కార్యాలయం నుండి నందిగామ మున్సిపల్ ఆఫీస్ కు ర్యాలీగా వచ్చి ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. అనంతరం తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగ్ ద్వారా మున్సిపల్ చైర్మన్ టీడీపీ దక్కించుకుందని తెలిపారు. నందిగామను అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో పనులు చేయకుండా దొంగ బిల్లులతో దోపిడీ చేశారని ఆరోపించారు. వాటి పై విచారణ చేసి తప్పకుండా తప్పు చేసిన వారి పై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సౌమ్య వెల్లడించారు. ప్రజల మౌలిక వసతుల కల్పన ధ్యేయమే మా లక్ష్యమని, ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి సారధ్యంలో నందిగామ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. వాట్సప్ గవర్నెన్స్ ను నందిగామ మున్సిపాలిటీలో అమలుకు ప్రణాళిక సిద్ధం చేస్తామి, నందిగామ మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపుతామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పాత రూటులో రవితేజ

## మాస్ జాతరపై మాస్ రాజా భారీ ఆశలు..!

రవితేజ పనైపోయిందిరా.. ఒక్క హిట్ కొడితే రెండు మూడు ఫ్లాపులిస్తాడు.. రెమ్యునరేషన్ బాగా ఇస్తే కథ కూడా పట్టించుకోడు..! ఇవే బయట కామన్‌గా మాస్ రాజాపై వచ్చే కామెంట్స్. అందులో నిజం లేదని నిరూపించుకునే పనిలో బిజీ అయ్యారు రవితేజ. మరి దానికోసం మాస్ రాజా ఏం చేస్తున్నాడు..? ఎలాంటి ప్లానింగ్ చేస్తున్నాడు..? గత కొన్నేళ్లుగా రవితేజ వరస విజయాలు అందుకున్న సందర్భాలు తక్కువ.. నిజం చెప్పాలంటే అసలు లేవనే చెప్పాలి. చివరగా 2010లో డాన్ శీను, 2011లో మిరపకాయ్‌తో వరసగా రెండు హిట్స్ ఇచ్చారు రవితేజ. దానికంటే ముందు దుబాయ్ శీను, కృష్ణ.. 2001-02 టైమ్‌లో ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం, ఇడియట్ లాంటి వరస హిట్స్ ఇచ్చాడు మాస్ రాజా. గత పదేళ్ళులో కేవలం ఒక్క హిట్ ఇస్తే.. రెండు మూడు ఫ్లాపులిచ్చారు రవితేజ. ఈ మధ్య మాస్ రాజా నుంచి వచ్చిన కొన్ని సినిమాలు చూశాక.. కేవలం రెమ్యునరేషన్ కోసమే సినిమాలు ఒప్పుకుంటున్నాడా ఏంటి అనే విమర్శలు ఫ్యాన్స్ నుంచే వచ్చాయి. నాలుగేళ్ళ కింద క్రాక్‌తో బ్లాక్‌బస్టర్ కొట్టి ఫామ్‌లోకి వచ్చిన రవితేజ.. ఖిలాడీ, రామారావు ఆన్ డ్యూటీతో మళ్లీ ట్రాక్ తప్పారు. రవితేజ అంతే.. ఇక మారడు.. పనైపోయిందనుకుంటున్న తరుణంలో ధమాకాతో రూ.100 కోట్ల క్లబ్బులో చేరిపోయారు. రొటీన్ కంటెంట్‌తోనే వచ్చినా.. మాస్ రాజా ఇమేజ్ బాగా యూజ్ అయింది. ఇక వాల్తేరు వీరయ్య విజయంలో బ్యాక్ బోన్‌లా నిలిచారు రవితేజ. కానీ ఆ వెంటనే మళ్లీ రావణాసుర, టైగర్ నాగేశ్వరరావు, ఈగల్ సినిమాలతో హ్యాట్రిక్ ఫ్లాపులిచ్చాడు. ప్రయోగాలు తనకు వర్కవుట్ కావని.. మళ్లీ మాస్ కంటెంట్‌పై ఫోకస్ చేసాడు రవితేజ. అది కూడా వర్కవుట్ కాలేదు. హరీష్ శంకర్‌తో చేసిన మిస్టర్ బచ్చన్ దారుణంగా ఫ్లాప్ అయింది. ప్రస్తుతం భాను భోగవరపుతో పూర్తిగా వింటేజ్ లుక్ ఉండేలా మాస్ జాతర సినిమా చేస్తున్నాడు. పైగా ఇది తనకు 75వ సినిమా కావడంతో రవితేజకు చాలా కీలకంగా మారింది. ఫ్యాన్స్ కూడా మాస్ జాతరపై అంచనాలు హై రేంజ్‌లోనే ఉన్నాయి. చిరంజవి విశ్వంభర కారణంగా మాస్ జాతర రిలీజ్ కాస్త ఆలస్యం కావొచ్చన్న టాక్ వినిపిస్తోంది. దీని తర్వాత మ్యాడ్ ఫేమ్ కళ్యాణ్ శంకర్‌తోనూ ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాడు మాస్ రాజా. మొత్తానికి కుర్ర దర్శకులకు ఛాన్సులిస్తూ దూకుసుపోతున్నాడు రవితేజ.

# ప్రేమ, హారర్, కామెడీ అంశాలతో..



మారిశెట్టి అఖిల్ హీరోగా, భానుశ్రీ హీరోయిన్‌గా శ్రీధన్ దర్శకత్వంలో ఎ.కె. టెక్ మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ పతాకంపై మారిశెట్టి శ్రీకాంత్ నిర్మించే నూతన చిత్రం చిత్రీకరణ ప్రారంభమైంది. అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని నిర్మాత సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో చిత్రీకరణ మొదలైంది. టైటిల్ నిర్ణయించాల్సిన ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నిర్మాత నట్టి కుమార్ క్లాప్ నిచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత మారిశెట్టి శ్రీకాంత్ మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ ఐదు రోజులపాటు జరుగుతుంది. ఇందులో భాగంగా ఒక పాట, ఒక ఫైట్ చిత్రీకరణ జరుపుతాం. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితర ప్రదేశాలలో షూటింగ్ చేస్తాం"అని చెప్పారు. దర్శకుడు శ్రీధన్ మాట్లాడుతూ "ప్రేమకథా చిత్రమిది. హారర్, కామెడీ అంశాలతో వైవిధ్యంగా దీనిని మలచబోతున్నాము"అని అన్నారు.

# స్టార్ హీరోయిన్స్‌ను మించిన రేంజ్

తెలుగులో సినిమాలకు ఎంత క్రేజ్ ఉంటుందో సీరియల్స్ కు కూడా అంతే క్రేజ్ ఉంటుంది. సినిమా హీరోయిన్స్ ఎంత ఫాలోయింగ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హీరోయిన్స్ మాములుగా ఒకొక్క సినిమాకు భారీగా రెమ్యునరేషన్ తీసుకుంటున్నారు. తన క్రేజ్ కు తగ్గట్టుగా రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారు. అలాగే సీరియల్ యాక్టర్స్ కూడా భారీగా రెమ్యునరేషన్ తీసుకుంటున్నారు. ఇప్పుడు ఓ సీరియల్ నటి హీరోయిన్ రేంజ్ లో రెమ్యునరేషన్ తీసుకుంటుంది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఒక్క ఎపిసోడ్‌కు రూ.65 లక్షల రెమ్యునరేషన్ తీసుకుంటుంది ఈ చిన్నది. అంతే కాదు తన అందంతోనూ ప్రేక్షకులను కవ్విస్తుంది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఓటీటీలు అందుబాటులోకి వచ్చిన తర్వాత తెలుగు సినిమాలు, సీరియల్స్ , సిరీస్ లతో పాటు ఇతర బాషల సీరియల్స్, సిరీస్ లు కూడా మన దగ్గర మంచి క్రేజ్ తెచ్చుకుంటున్నాయి. అలాగే కొరియన్ సిరీస్ లకు కూడా మన దగ్గర మంచి క్రేజ్ ఉంది. చాలా మంది కొరియన్ సిరీస్ కు ఫ్యాన్స్ చాలా మందే ఉన్నారు. వీటిలో నటించిన కొందరు ఆర్టిస్టులు చాలా పాపులర్ అయ్యారు. అలాగే ఓ కొరియన్ స్టార్ కూడా ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ తెచ్చుకుంది. జున్ జి-హ్యాన్. ఈ బ్యూటీకి చాలా మంది ఫ్యాన్స్ ఉంటారు. 43 ఏళ్ల వయసులోనూ ఈ చిన్నది తన అందంతో కవ్విస్తుంది. మై సాసీ గర్ల్ అనే రొమాంటిక్ కామెడీ సిరీస్ తో క్రేజ్ తెచ్చుకుంది. ఈ చిన్నది మై లవ్ ఫ్రమ్ ది స్టార్, ది లెజెండ్ ఆఫ్ ది బ్లూ సీ, అలాగే నెట్‌ఫ్లిక్స్ సిరీస్ కింగ్‌డమ్, అనేక కొరియర్ డ్రామాలలో నటించింది. ఈ అమ్మడు ఒకొక్క ఎపిసోడ్ కు దాదాపు 99,900 %ఖూణ% అందుకుంటుంది. మన దగ్గర దాదాపు రూ. 65లక్షలు. ఇక ఈ చిన్నదానికి మన దగ్గర కూడా మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది.



# యూత్‌కు పవర్‌ప్యాక్డ్‌గా 'లైలా'



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ 'లైలా'. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైంది. విశ్వక్ సేన్ తొలిసారి ఈ సినిమాలో లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ఈ అంచనాలను మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో టీమ్ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో చాలా గ్రాండియర్‌గా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నా. కచ్చితంగా లైలా మిమ్మల్ని బాగా నవ్విస్తుంది. ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి.. నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నా. ప్రీరిలీజ్ ఈవెంట్ ఉంది కాబట్టి అక్కడ మాట్లాడుతా. లైలా నుంచి నెక్స్ అటక్ పటక్ సాంగ్ రిలీజ్ అవుతుంది. ఆ సాంగ్ నేనే రాశా. అది కూడా మీకు నచ్చుతుంది. నేను ఈ సినిమాలో లేడీ గెటప్ వేసింది ఎంటర్‌టైన్ చేయడానికి. అందులో భాగంగానే కొన్ని డైలాగ్స్ ఉన్నాయి. యూత్‌కు పవర్‌ప్యాక్డ్‌గా సినిమా ఉంటుంది. ఫిబ్రవరి 14న అందరం థియేటర్లలో కలుద్దాం" అని చెప్పారు. డైరెక్టర్ రామ్ నారాయణ్ మాట్లాడుతూ "లైలా సినిమాలో పూర్తిగా ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది"అని తెలిపారు. నటి కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ "ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. అందుకే టీజర్, ట్రైలర్‌లో ఎక్కడా చూపించలేదు. కామాక్షి అంటే చాలా ఇంటెన్స్ రోల్స్ చేస్తుందనే మార్క్ ఉంది. ఆ మార్క్‌కు తగ్గట్లే ఇందులో నా పాత్ర ఉంటుంది. ఆ క్రెడిట్ అంతా డైరెక్టర్ రామ్ నారాయణ్‌దే"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సాహు గారపాటి, డ్యాన్స్ మాస్టర్ భాను పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com